**మధ్యాహ్నం** భోజనం ముగించి, వారపత్రిక పట్టుకొని, పడక గదిలో కూర్చుంది సత్యవతి. కాగితాలు తిప్పటమేకాని, ఏదీ చదవ బుద్ధి కావటం లేదు.

ఒకటా, రెండా— అప్పుడే పది రోజులు గడిచి పోయింది తను ఇక్కడికి వచ్చి! వచ్చిన మరునాటి రోజు నుంచీ అనుక్షణం అతని రాక కోసం ఎదురు చూస్తూనే ఉంది— వస్తాడన్న నమ్మకంతోనే. కాని, అతను రాలేదు. కారణం అంతు పట్టడం లేదు.

అత్తగారితో పోట్లాడి, భర్త మీద అలిగి, పుట్టింటికి వచ్చేసిన కథానాయిక సత్యవతి. తన వెనకాలే భర్త పరుగెత్తుకు వస్తాడన్న ధీమాతో అంత పని చేసింది. వివాహమయింది లగాయితు అతను ప్రవర్తించిన తీరును బట్టి అలా ఊహించుకో గలిగింది సత్యవతి. కారణం ఏమైనప్పటికీ, తన అంచనా తారుమారైనందుకు ఆమెకు నిరుత్సాహమూ, బాధా కలిగినవి. ఇలా జరగటానికి అవకాశం ఉంటుందన్న అనుమానం ముందే వచ్చి ఉన్నట్టయితే, సమస్యను ఇంత దూరం రానివ్వకుండా, అక్కడే పరిష్కరించుకోవటానికి ప్రయత్నించి ఉండను. అతను రావటమే కాకుండా, పతి మాలి, ప్రాధేయపడి, తన షరతులకు అంగీకరించి మరీ వెంట బెట్టి తీసుకు వెళతాడన్న ఆశాభావంతోనే ఇన్ని రోజులు ఎదురు చూసింది. తన ఆశ నిరాశ అయి పోయింది. ఇప్పుడు తన కర్తవ్యమేమిటి? తను ఇక్కడికి వచ్చింది శాశ్వతంగా ఉండి పోవటానికి కాదు కదా! కారణం లేకుండా ఎక్కువ కాలం పుట్టింటిలో ఉండటం అనవసరమైన అనుమానాలకూ, అవమానాలకూ హేతువు అవుతుంది. బయట వాళ్ళ దాకా ఎందుకు? ఇంట్లో తలి దండ్రులకే అప్పుడే అనుమానం వచ్చేసింది. 'అల్లుడిగారితో ఏమైనా పోట్లాట పెట్టావా?' అని అడిగేశారు. ఈ పెద్ద వాళ్ళ అసాధ్యులు. ఇలాంటి విషయాల్లో ఆలోచించకుండానే తీర్పులు చెప్పి పెట్టేస్తారు. అలాంటి దేమీ జరగలేదని తను చెప్పినా వాళ్ళు నమ్మరు.

ఒక్కొక్క రోజూ గడుస్తున్న కొద్దీ అతను వస్తాడన్న ఆశ సన్నగిల్లి పోసాగింది. పోనీ, తిరిగి వెళ్ళి పోతేనో?— అన్న ఆలోచన కూడా ఆమెకు రాకపోలేదు. అయితే, తనంతట తానుగా తిరిగి వెళ్ళిపోతే మరీ లోకువగా ఉంటుందని, ఆ ప్రయత్నం విరమించుకుంది.

మొదట్లో 'రాకేం చేస్తాడులే!'— అనుకుంది ధైర్యంగా. ఇప్పుడేమో 'వస్తాడో, రాడో?' అని సంశయిస్తూంది రుక్మిణీ కల్యాణంలో 'ఘనుడా భూసురు డేగెనో...' అన్న పద్యంలో రుక్మిణిలా. రాడేమో అన్న భావనే భయ విహ్వలను చేస్తూంది. అనుక్షణం మనస్సు అటే లాగుతూంది. శరీరం కూడా అతని స్పర్శ కోసం తహతహ లాడిపోతూంది. పది రోజులంటే మాటలా! విరహతాపం విజృంభిస్తే, ఇంక మనిషిని నిలవనిస్తుందా?

కిం కర్తవ్యం?

వాట్ టు డు?

క్యా కర్నా?

ఏం చెయ్యాలి?

ఎటూ పాలుపోవటం లేదు. సమస్య అపరిష్కృత ధంగానే ఉండి పోయింది. దీనికంతటికీ కారణభూతమైన అత్తగారు గుర్తు వచ్చి, ఒళ్ళంతా కారం రాసుకున్నట్టు అయింది. ఎక్కడో మంచో దూరో ఉంది కనక సరిపోయింది కాని, ఆ క్షణంలో ఎదురుగా ఉండి ఉంటే అత్తగారిని ఏం చేసి ఉండేదో ఆమెకే తెలియదు. అంతటి ఆగ్రహం కలిగింది.

ప్రతి అత్తా ఒక ఇంటి కోడలే. ఆ సత్యం మరువరానిది. కాని, అత్తలందరూ కోడళ్ళను ఆరడి పెడుతూనే ఉంటారు. కొందరైతే రాచి రంపాన పెడుతూంటారు. కొడుక్కి పెళ్ళయి, కోడలు కాపురానికి వచ్చిందంటే చాలు — మహారాణి పదవి లభించినంత సంబరం కలుగుతుంది అత్తగారికి. అత్తల పెత్తనాలకు అర్థం పర్థం ఉండదు. ఉచితానుచితాలు కూడా పాటించకుండా, ప్రతిదానిలోనూ తగుదునమ్మా అని తల దూర్చి, రసాభాస చేసేస్తుంటారు. వయసులో ఉన్న పిల్లలు ఏదో క్రిందా మీదా పడుతుంటారు, చూసీ చూడనట్టు పోదాం అన్న కనీస జ్ఞానం పీళ్ళకు ఎందుకు ఉండదసలు? అప్పుడే సత్యవతిని బాధించే ప్రశ్న.

బాల్య వివాహాలు, వరకట్నం నిషేధిస్తూ చట్టం చేసినట్టే, కొత్త దంపతులు విధిగా వేరింటి కాపురం పెట్టాలని కూడా ప్రభుత్వం వారు ఒక చట్టం చేస్తే బాగుండును కదా! అని సత్యవతికి అనిపిస్తూ ఉంటుంది, అప్పుడప్పుడు.

మనిషి రాలేదు సరికదా, కనీసం ఉత్తరం ముక్క అయినా వ్రాయలేదు!

దీని భావమేమి తిరుమలేశ? ఎదురుగా గోడ మీద ఉన్న తిరుపతి వెంకన్న కాలెండర్ వైపు చూస్తూ అనుకుంది సత్యవతి.

గాలి విసురుకు రెపరెప కొట్టుకుంది కాలెండర్.

ఇలాంటి సంకేతాలను సమస్యలకు అన్వయించి అర్థాలు చెప్పుకోగల సామర్థ్యం, అనుభవం, అలవాటు లేని సత్యవతి తిరిగి ఆలోచనలో పడి పోయింది.


ఇంతకాలం అతను తనతో చెప్పినవన్నీ ఇచ్చకాల కబుర్లేనా? తనపైన చూపిన దంతా కపట ప్రేమేనా?


ఎంత మోసపోయింది తను!

నిజమే! తనను చూడకుండా ఒక్క క్షణమైనా ఉండలేనని పదే పదే చెప్పిన పెద్ద మనిషి, పది రోజులైనా కిమ్మనకుండా ఎలా ఉండ గలిగాడు?

అత్తగారు పెట్టే ఆరళ్ళ గురించి తను ఎన్ని సార్లు మొర పెట్టుకున్నా విని ఊరుకున్నాడే తప్ప, ఇదేమిటని ఒక్కసారైనా తల్లి నడిగిన పాపాన పోలేదు. పైగా ఒకటి, రెండు సార్లు తనకే నీతులు చెప్ప వచ్చాడు—పెద్ద వాళ్ళేవో చాదస్తంగా ప్రవర్తిస్తుంటారు, మనమే సర్దుకు పోతూ ఉండాలి అని! ఒక్కడికి తనే కావాలని గొడవ పడుతున్నట్టు! తన మీద నిజంగానే ప్రేమ ఉన్నట్టు అయితే, తన మాట నెందుకు లక్ష్య పెట్టడు? తన అభీష్టాన్ని తీర్చకపోగా, తన బాధ అర్థం చేసుకొని, నాలుగు సానుభూతి వాక్యాలైనా పలకలేదు. అనుమానం లేదు— అతను ఆడిందంతా నాటకమే—కపట నాటకం— మోసం— దగా. చెప్పి మొద్దు—అదంతా నిజమేనని నమ్మేసింది తను. ఇప్పుడు అర్థమవుతూంది, అసలు రంగేమిటో!

సత్యవతి మనసు కుతకుత ఉడికిపో సాగింది.




శృంగార నాయికలు
కలహాంతరిత
CHANDRA

లేచి పచార్లు మొదలు పెట్టింది, గదిలో. నాలుగు సార్లు అటూ ఇటూ తిరిగింది. ఇంతట్లోకి ఇంటి ముందు రిక్షా ఆగిన శబ్దం వినిపించింది. కిటికీ లోంచి తొంగి చూసింది. బ్రీఫ్ కేస్‌తో దిగి, రిక్షా వాడికి డబ్బు లిస్తున్న పెద్ద మనిషి వెనక్కు తిరిగి ఉన్నా— అతనే కృష్ణమూర్తి—తన భర్తేనని పోల్చుకో గలిగింది సత్యవతి.

ఒక్క ఉదుటున వరండాలోకి వచ్చేసింది కాని, వెంటనే అహం గుర్తు వచ్చింది. కృష్ణ మూర్తి ఇటు తిరగక ముందే గిరుక్కున వెను దిరిగి, లోపల ఎక్కడో ఉన్న తల్లిని ఉద్దేశించి, 'అమ్మోయ్!' అని ఒక కేక వేసింది. గదిలో దూరి మంచం ఎక్కి, గోడవేపు తిరిగి పడుకుంది.

కేక విని, ముందు గదిలోకి వచ్చిన సత్యవతి తల్లికి కూతురు కనిపించలేదు. వరండా మెట్లెక్కు తున్న అల్లుడు కనుపించాడు.

పెట్టె అందుకొని, కాళ్ళకు నీళ్ళిచ్చి, కుశల ప్రశ్నలడిగి, అల్లుడికి చెయ్య వలసిన మర్యాద అంతా చేసింది ఆ ఆడ పిల్లను కన్న తల్లి. అత్త వారి ఇంట్లో ఏదో గొడవ పడే కూతురు వచ్చిం దన్న సంగతి ఆమె మొదటే అనుమానించింది. ఆ ప్రస్తావన తెచ్చినప్పుడల్లా సత్యవతి మాట దాట వెయ్యటంతో ఆమె అనుమానం ధ్రువ పడింది. ఇప్పుడు కూడా అతనికి ఎదురు పడటం ఇష్టం లేకనే తనను పిలిచి, గదిలోకి తప్పుకుందన్న సంగతి ఆమె గ్రహించక పోలేదు.

ముందు గదిలో కూర్చుని, మొహ మాట పడుతూ చుట్టూ చూస్తున్నాడు కృష్ణమూర్తి.

"అమ్మాయి గదిలో ఉంది, బాబూ!" అని చెప్పి, వంట గదిలోకి తప్పుకుంది ఆ ఇల్లాలు.

మెల్లగా లేచి, పిల్లిలా అడుగులు వేస్తూ గదిలో ప్రవేశించాడు కృష్ణమూర్తి.

అతనూ, తల్లీ మాట్లాడుకున్నది స్పష్టంగా విన్నది సత్యవతి. అతను గదిలో ప్రవేశించటం కూడా అడుగుల చప్పుడు ద్వారా గమనిస్తూనే ఉంది.

సినిమా కృష్ణుడిలా 'అలిగితివా సఖీ ప్రియా, కలత మానవా!' అంటూ పాట అందుకోలేదు కృష్ణ మూర్తి. మంచం సమీపించి ముందుకు వంగి, మృదువుగా భుజం మీద చెయ్యి వేసి, తనవైపు తిప్పుకోవటానికి ప్రయత్నించాడు.

ముక్కు తిమ్మన్నగారి సత్యభామలా కాలికి పని కల్పించలేదు సత్యవతి. భర్త చెయ్యి తగలగానే పరవ శించి ఇటు తిరిగిపోనూ లేదు. మరింత గట్టిగా బిగుసుకు పోయింది.

తలుపులు దగ్గరగా వేసి, నానా తిప్పలూ పడి, ఎట్టకేలకు సత్యవతిని తనవైపు తిప్పుకో గలిగాడు కృష్ణమూర్తి.

మనిషైతే ఇటు తిరిగింది కాని, మంకుపట్టు మాత్రం వదల లేదు సత్యవతి.

పట్టు వదలని విక్రమార్కుడిలా ఎన్నో విధాల ప్రయత్నించి, అంతకు ముందు అసలేమీ జరగ నట్టే ప్రవర్తించి, ఆమెను మాటల్లోకి దింప గలిగాడు కృష్ణమూర్తి. కానీ, ఏం లాభం? ఒక చిరు నవ్వు లేదు. ముద్దు పలుకు లేదు. కుశల ప్రశ్న లేదు. బాకుల్లాంటి మాటలు. ఈటెల్లాంటి ప్రశ్నలు. ఒక్క మాటలనా, ప్రశ్నలేనా? ఎత్తి పొడుపు— అవ హేళన—నింద ఓర్పుకి కూడా ఒక హద్దు ఉంటుంది. కృష్ణమూర్తి కనక అంత వరకు నిగ్రహించుకో గలి గాడు.

ఈలోగా సత్యవతి తల్లి ఉప్మా ప్లేటుతో రెండు సార్లు వచ్చి, తిరిగి వెళ్ళి పోయింది—తలుపులు దగ్గరికి వేసి ఉండడంతో, చిన్నగా నవ్వుకుంటూ.

సత్యవతి నోటి నుండి వెలువడిన ప్రతి మాటా కృష్ణమూర్తి సహనాన్ని క్రమక్రమంగా హరించి వెయ్య సాగింది. అందుకు కృష్ణమూర్తి బాధ పడు తున్నాడు కూడా. కాని, సత్యవతి అది గమనిస్తు న్నట్టు లేదు.

సత్యవతి ప్రశ్నల సారాంశమంతా ఒక్కటే— 'మీకు తల్లి ముఖ్యమా? పెళ్ళాం ముఖ్యమా?' అని! ప్రతి భార్య తొలి రోజుల్లో భర్త నడిగే ప్రశ్నే కావచ్చు ఇది. కాని, ప్రశ్నించినప్పుడు సమాధానం కూడా వినాలికదా? అసలు సమాధానం చెప్పే అవకాశమే కృష్ణమూర్తికి ఇవ్వలేదు సత్యవతి. అక్క

బైద్యనాథ్

శ్రీ బైద్యనాథ్ ఆయుర్వేద భవన్ లిమిటెడ్ 60 సం॥ల క్రితం స్థాపించబడి దేశవిదేశాలలో ఆయుర్వేద ఔషధములు తయారుచేయు పెద్ద సంస్థగా ప్రఖ్యాతి గాంచినది.

BAIDYANATH AYURVED BHAWAN LTD CALCUTTA

ప్రాచీన ఆయుర్వేద గ్రంథముల ననుసరించి 700 రకముల ఆయుర్వేద ఔషధములు కలకత్తా, పాట్నా, ఝాన్సీ, అలహాబాద్ మరియు నాగపూరులలోని 5 కర్మాగారములలో అత్యంత అధునాతన పద్ధతిలో బైద్యనాథ్‌చే తయారుచేయబడు చున్నవి.

బైద్యనాథ్ ఔషధాలు 800 విక్రయశాలలు మరియు 60,000 ఏజన్సీలు మరియు ఔషధ విక్రేతలద్వారా భారతదేశ మంతటా లభించుచున్నవి.



మీ కుటుంబ ఆరోగ్యమునకు
బైద్యనాథ్ ఔషధములయందు విశ్వాసముంచండి.

INTERMARK/ SBAB/ 16

బైద్యనాథ్: ఆయుర్వేద శాస్త్ర ప్రామాణికతకు మారు పేరు

విక్రయశాలలు ఆంధ్రప్రదేశ్ : 21-7-802, హైకోర్టు ఎదుట, హైదరాబాద్-2.
కర్ణాటక : బి.వి.కె. అయ్యంగార్ రోడ్, బెంగుళూర్.


డికి ఎంతో ప్రయత్నించాడు మహాను భావుడు— తన పరిస్థితి వివరించటానికి. ఆమె చెప్పనిస్తేనా? పైగా— 'నా పిచ్చి కాకపోతే, పది రోజుల వరకు మనిషి సంగతే పట్టని వాడికి పెళ్ళాం ముఖ్య మెలా అవుతుంది?' అని తనే సమాధానం చెప్పుకుంది.

పది రోజుల వరకు రాకపోవటంలో తన అప రాధం ఏమీ లేదనీ, ఆ తప్పంతా ఇన్ స్పెక్షన్ పేరుతో సెలవు మంజూరు చెయ్యకపోగా ,ఆదివారం కూడా పని చేయించుకున్న ఆఫీసర్ దేననీ విశ్లేషించు కున్నాడు కృష్ణమూర్తి.

ఈసారి సమాధానం చెప్పనిచ్చినా, అతని మాటల్ని విశ్వసించలేదు సత్యవతి. పైగా ఒక్కటంటే ఒక్క మాటతో కొట్టి పారేసింది— "కట్టు కథ లెన్నైనా చెప్పవచ్చు!" అని.

మండి పోయింది కృష్ణమూర్తికి. "కట్టు కథలు చెప్పవలసిన కర్మ నాకేం పట్టింది? అదే నిజమైతే ఇప్పుడు మాత్రం ఎందుకు రావాలి నేను?"

"ఏమో? ఏ మవసరం వచ్చిందో వచ్చిన వారికే తెలియాలి!" అనేసి మళ్ళీ గోడవేపు తిరిగి పోయింది సత్యవతి.




"అవసరం నాకేనా, నీకు లేదా?"

సత్యవతి నుండి సమాధానం లేదు.

"సరే అయితే. నీకు లేని అవసరం నాకుమాత్రం ఎందుకు ఉండాలి? నే వెళుతున్నా" అనేసి విసురుగా లేచాడు కృష్ణమూర్తి.

బెదిరింపే అనుకొని లెక్కచెయ్యలేదు సత్యవతి. తలుపు చప్పుడు కావటంతో అనుమానంగా ఇటు తిరిగి చూసింది. అప్పటికే సూట్ కేస్ తీసుకొని గుమ్మం దిగిపోయాడు కృష్ణమూర్తి.

దిగ్గున మంచం దిగింది సత్యవతి.

పెద్ద పెద్ద అంగలు వేసుకొని, వీధి మలుపు తిరిగేశాడు కృష్ణమూర్తి.

నిశ్చేష్టురాలై పోయింది సత్యవతి.

తలుపు చప్పుడు విని, మళ్ళీ ఉప్మాప్లేటు తీసు కొని వచ్చింది సత్యవతి తల్లి. ఖాళీ గదిలోకి తొంగి చూసి, అల్లుడు లేడని నిర్ధారించుకుని, వీధి గుమ్మంలో శిలా ప్రతిమలా నిలబడి ఉన్న కూతుర్ని— "అల్లు డేడమ్మా?" అని అడిగింది.

"వెళ్ళిపోయారు."

"ఎక్కడికి?"

"ఏమో? పెట్టె కూడా తీసుకు పోయారు!"

"ఇదేం కర్మే! ఇప్పుడే కదా వచ్చాడు—అప్పుడే వెళ్ళి పోవటమేమిటి? కనీసం కాఫీ అయినా తాగలేదు. నువ్వేమన్నా దురుసుగా మాటాడావా?" అను మానంగా అడిగింది.

"దురుసుగా అంటే నీ ఉద్దేశం?" మింగే సేలా చూసింది తల్లివంక.

"నీ తత్వం అంతేలే. నువ్వీ జన్మకు మారవు."

"ఉన్న మాట అంటే దురుసుగానే ఉంటుంది. అస లక్కడ ఏం జరిగిందో నీకు తెలుసా?"

"అక్కడ ఏం జరిగినా, తప్పెవరిదైనా, అత నిక్కడికి వచ్చినప్పుడు గౌరవించటం మన ధర్మం. తక్కిన విషయాలు తరవాత నెమ్మదిగా మాట్లాడు కోవాలి. వచ్చినవాడు వచ్చినట్టే వెళ్ళిపోయాడంటే, చూసిన వాళ్ళేమనుకుంటారు? అసలు మనకు మాత్రం బాగుంటుందా?"

"ఇంతకూ నువ్వనే దేమిటి? నేనే కావాలని వెళ్ళగొట్టా నంటావా?"

"వెళ్ళమని నోటితోనే చెప్పక్కర్లేదమ్మా—ప్రవ ర్తించిన తీరే ఆ పని చేస్తుంది. అత నింత దూరం పని గట్టుకొని వచ్చింది ఎవరికోసం? నీకోసమే కదా! అక్కడ జరిగిన గొడవ అంతా మరిచిపోయి, అతను నీ దగ్గరికి వస్తే, అది అలుసుగా తీసుకుని నువ్వు నెత్తెక్కి కూర్చోవటం వివేకం అనిపించు కోదు. ఆలు మగల మధ్య వచ్చే ప్రణయ కలహాలు రక్తిని పెంచేవిగా ఉండాలికాని, విరక్తి కలిగించ కూడదు. భర్తే కదా అని మరీ బెట్టుచేస్తే ఇలాగే బెడిసి కొడుతుంది. దేనికైనా ఒక హద్దు ఉండాలి. పాపం! ఎంత బాధ కలిగిందో—వెంటనే వెళ్ళి పోయాడు. ఈ సంగతి మీ నాన్న గారికి తెలిస్తే నా మీద విరుచుకు పడతారు. ఇప్పు డేం చెయ్యాలో అర్థం కాకుండా ఉంది!" అంటూ లోపలికి వెళ్ళి పోయిం దావిడ.

సత్యవతి కూడా గదిలోకి వెళ్ళి, ఆలోచనలో పడి పోయింది.

ఆయన వెళ్ళి పోవటం తనకు మాత్రం ఆనం దంగా ఉందా? పది రోజుల పాటు క్షణం క్షణం ఆయన రాక కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు తెన్నులు చూసిం దెవరు? తను కాదా? అలాంటిది ఆయన వచ్చిన తరవాత వెంటనే పంపించెయ్యాలని ఎందుకు అనుకుంటుంది? ఆయన రాక తన కెంతటి ఆనం దాన్ని కలిగించిందో ఎవరికి తెలుస్తుంది? వెంటనే బయట పడిపోతే అలుసుగా ఉంటుందని కొంచెం బెట్టు చూపింది. అంతే—ఇలా జరగాలని కాని, జరుగుతుందనికాని తను వూహించలేదు. అయినా, తన తెలివితక్కువతనం కాకపోతే భార్యా భర్తల మధ్య అలుసు అయిపోవటం ఏమిటి? ఒకవేళ అలుసైతే మాత్రం నష్టమేమిటి?

తనను గురించి పది రోజుల వరకు పట్టించు కోలేదన్న బాధ కూడా తన మొండితనానికి కొంత కారణమైంది. ఆ బాధలోనే ఆయన ఏం చెబుతున్నా సరిగా వినిపించుకోలేదు. వినిపించుకున్నా అర్థం చేసుకోవటానికి ప్రయత్నించలేదు.

ఆయనకు తనపైన ప్రేమ లేదని ఎలా అనుకో గల దసలు? అదే నిజమైతే ఇప్పుడు మాత్రం ఆయన ఎందుకు వస్తారు? ఇంతగా తన నెందుకు బతిమాలుతారు?

ఆఫీసులో ఇన్ స్పెక్షన్ ఉండటం, సెలవు ఇవ్వక పోవటం వగైరాలన్నీ నిజమే అయి ఉండాలి. ఆ కారణంచేతనే ఇంత కాలం రాలేక పోయి ఉంటారు. ఏ రోజు కా రోజే సెలవు ఇస్తారన్న ఆశతో, ఏకంగా బయలుదేరి రావచ్చు కదా అని ఉత్తరం కూడా వ్రాయటం మానేసి ఉంటారు. తనే పొర పడింది. అపార్థం చేసుకొని, అనుచితంగా ప్రవర్తిం చింది. అనవసరంగా ఆయన్ని బాధ పెట్టింది. తనూ బాధ పడుతూంది ఇప్పుడు. కాస్త సౌమ్యంగా ప్రవర్తించి ఉండవలసింది.

అంతా జరిగిపోయిన తరవాత ఇప్పుడు తెలు స్తోంది తను చేసిన తప్పేమిటో! ఈ జ్ఞానం ముందే ఉండి ఉంటే ఎంత బాగుండేది?

పొద్దు వాలింది.

చీకటి పడింది.

తల్లి తిట్టింది. తండ్రి మందలించాడు.

తప్పు తనదేనని పూర్తిగా అంగీకరించింది సత్య వతి. అదే విషయం ఉత్తరం వ్రాయాలని కూడా నిశ్చయించుకుంది.

పాపం! ఆ రాత్రంతా నిద్రలేదు సత్యవతికి. ★

**(కోపగించి, భర్తను దూషించి వెడలగొట్టి, అతడు వెళ్ళి పోయిన తరవాత పశ్చాత్తాప పడే నాయిక-కలహాంతరిత.)**

**వచ్చే వారం**

**శృంగార నాయిక-**

**ప్రోషిత భర్తృక**